క్లుప్తంగా

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమం



ఎస్ రమేష్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు



జగ్గవరపు జానకి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు

చింతలపూడి: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమమని చింతలపూడి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఎస్.రమేష్ రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక ఆధారాలు లేని లిక్కర్ స్కాములో ఇరికించి అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుల పట్ల కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇలాంటి తప్పుడు కేసులకు పార్టీ నాయకులు భయపడేది లేదని అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయం అన్నారు. మిథున్ రెడ్డికి తామంతా అండగా ఉంటామని అన్నారు.

పట్టెన్నపాలెం వైఎస్సార్ సీపీ కమిటీ ఎన్నిక



వైఎస్సార్‌సీపీ పట్టెన్నపాలెం గ్రామ కమిటీ

జంగారెడ్డిగూడెం: మండలంలోని పట్టెన్నపాలెం గ్రామ వైఎస్సార్ సీపీ కమిటీని పార్టీ మండలాధ్యక్షుడు ఓరుగంటి నాగేంద్ర పర్యవేక్షణలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామిశెట్టి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా బండారు సత్తిరాజు, వుసుపులేటి లక్ష్మీనారాయణ, చిలకా సత్యనారాయణ, చిలింతరావుల మల్లేశ్వరరావు, కార్యదర్శి పులపాకుల శ్రీనివాసరావు, దండాబత్తుల లక్ష్మీనారాయణ, నైనారపు సురేష్, శీలం రాయుడు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ప్రచార కమిటీ చైర్మన్ బల్లే అశోక్‌బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదరంగం పోటీలు




రోటరీ కమ్యూనిటీ హాల్‌లో చదరంగం పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం చెస్ పోటీలు నిర్వహించారు. రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు పెనుమర్తి సురేష్‌బాబు, సంధ్య ప్రవల్లిక ఆధ్వర్యంలో చెస్ మాస్టర్, రోటరీ సభ్యులు అయినపర్తి చంద్రశేఖర్ పోటీలను జరిపారు. 68 మంది బాలబాలికలకు సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా విజేతలకు ప్రశంసాపత్రాలు, మెడల్స్, మొమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్, చామర్తి శ్రీరాములు, రామతారకం, పాలపర్తి శ్రీనివాస్, దాకారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూముల్లో సాగు చేయాలి

జంగారెడ్డిగూడెం: కేతవరం గ్రామంలో దళిత పేదలకు కేటాయించిన సీలింగ్ భూముల్లో దుక్కిదున్ని సాగు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బీకేఎంయయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం కేతవరంలోని సీలింగ్ భూములను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ కేతవరం సీలింగ్ భూములు పట్టాదారులకు దక్కేవరకు సీపీఐ, బీకేఎంయూ పోరాడుతుందన్నారు. అధికారులు పట్టాదారులకు భూములు చెందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేవీ రమణరాజు, సుంకర రాధాకృష్ణ, గొలిమే బాల ఏసు, కూరాకుల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి.. 15 మంది అరెస్ట్



దాడుల్లో పట్టుబడ్డ నిందితులు

ద్వారకాతిరుమల: ఐఎస్ రాఘవాపురం శివారులోని ఒక తోటలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై దాడి చేసి 15 మందిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై సుధీర్ తెలిపారు. నిందితుల నుంచి రూ. 20,670 ల నగదు, 4 కోడి పుంజులు, 10 బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు. కోడి పందేలు, పేకాటలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. జూదాలపై 112 కు, లేదా 94407 96653 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

ఉసూరుమనిపిస్తున్న వర్షాలు

- ముఖం చాటేస్తున్న వరుణుడు
- పంటల సాగుకు నోచుకోని పొలాలు
- అదును దాటుతుందని అన్నదాతల ఆందోళన



బుట్టాయగూడెం సమీపంలో వర్షాలు లేక ఎండుతున్న వరి నారుమడి



బోర్ల కింద వరినాట్ల కోసం ట్రాక్టర్‌తో దుక్కు దున్నుతున్న దృశ్యం

బుట్టాయగూడెం: వర్షాలు ముఖం చాటేయడంతో సాగు నీరు లేక ఈ ఏడాది ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. వర్షాకాలం ఆరంభంలోనే తొలకరి వానలు పడడంతో గంపెడాశలతో సాగు చేపడదామనుకున్న రైతులకు ఆ తరువాత వానల జాడ రాకపోవడంతో అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. జూలై మాసం మరో పది రోజుల్లో ముగియనున్న ఇంతవరకూ సరైన వర్షాలు లేకపోవడంతో అదును దాటిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పోలవరం నియోజకవర్గంలోని వర్షాభావ పరిస్థితులు రైతులను వెంటాడుతున్నాయి. ఆకాశం మేఘావృతం కావడం కొద్దిపాటి చినుకులు పలుకరించి పోవడం ఆ తర్వాత ఆవిరి కావడంతో అన్నదాతలు ఆకాశం వైపు చూస్తూ నిరాశ చెందుతున్నారు. ఏటా జూన్ నెలాఖరులోని ఆరుద్ర కార్తెకంతా వర్షాలు కురిసి రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యేవారు. అలాంటిది పెద్ద పునర్వసు కార్తె దాటి చిన పునర్వసు కార్తె వస్తున్నా ఇంకా వరుణుడు కరుణ చూపడంలేదని రైతులు నిరాశ చెందుతున్నారు.

దిక్కుతోచని స్థితిలో రైతులు

పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, టి.నర్సాపురం, కొయ్యలగూడెం మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 32,663 హెక్టార్లలో పంటల సాగు చేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే వర్షాలు ఆశించినంత కురవకపోవడంతో పొలాల్లో విత్తనం ఎప్పుడు వేయాలో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గత ఏడాది జూలై మొదటి వారం నాటికి 90 శాతం సాగు పూర్తయింది. ఈ ఏడాది జూలై 20 వతేదీ దాటినా వర్షాభావ పరిస్థితుల వల్ల 30 శాతం మాత్రమే సాగు పనులు జరిగినట్లు తెలుస్తోంది.

ఆషాఢం ముగిసే నాటికి నాట్లు పూర్తి కావాలి



ఈ ఏడాది సరైన వర్షాలు లేక నారుమడులు పాడైపోయో పరిస్థితి నెలకొంది. ప్రతి ఏటా ఆషాఢ మాసం ముగిసే నాటికి వరి నాట్లు పనులు పూర్తి చేసేవారం. ప్రస్తుతం శ్రావణ మాసం వస్తున్నా వర్షాలు కురవకపోవడం ఆందోళన కలిగిస్తుంది. ఇప్పటికైనా వరుణుడు కరుణిస్తే ఆలస్యంగానైనా పనులు ప్రారంభిస్తాం.

– దోరేపల్లి సత్యనారాయణ, రైతు, బుట్టాయగూడెం

ఆగస్టు 15 వరకు నాట్లు వేసుకోవచ్చు



ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సంబంధించి బోర్లు ఉన్న రైతులు వరినాట్లు వేస్తున్నారు. వర్షాధారంపై ఆధార పడిన రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. ఆగస్టు 15 వరకు వరినాట్లు వేసుకోవచ్చు.

– కె.గంగాధరం మండల వ్యవసాయాధికారి, జీలుగుమిల్లి

మానవత కార్యాలయం ప్రారంభం

చింతలపూడి: మానవత స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ సమీపంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. మానవత వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్ రామచంద్ర రెడ్డి, జిల్లా కేంద్ర కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వర రావు, జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కరరావు, ఆర్నేపల్లి అప్పారావు, డా ఎ.సత్యన్నారాయణ, సభ్యులు, పాల్గొన్నారు.

గంగానమ్మకు ప్రత్యేక పూజలు

దెందులూరు: కొవ్వలి గ్రామంలో గ్రామ దేవతలు శ్రీగంగానమ్మ, శ్రీకనకాలమ్మ, పోతురాజులకు ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవార్లకు పలు రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ చేశారు. కొవ్వలి గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని వర్షాలు కురిసి పంటలు పండి రైతులతో పాటు అందరూ సుభిక్షంగా ఉండాలని మొక్కుకొని పూజలు చేశారు.

మోసపూరిత హామీలపై కూటమిని నిలదీయాలి



జలపవారిగూడెంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న కంభం విజయరాజు



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన చౌక్కా దావీదు కుటుంబ సభ్యులు

కామవరపుకోట: మోసపూరిత హామీలతో గద్దెనెక్కి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న కూటమి నాయకులను సూపర్ సిక్స్ పథకాలపై నిలదీయాలని వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. ఆదివారం జలపవారిగూడెం గ్రామంలో పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కేసరి సరిత విజయభాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో బాబు షూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.

నిలువునా మోసం

ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలుతో గద్దె నెక్కి నమ్మి ఓట్లు వేసిన ప్రజలను నిలువునా మోసం చేశారాన్నారు. అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని చెప్పి ఏడాది దాటినా ఒక్క పథకాన్ని కూడా సంపూర్ణంగా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఏడాదికి 3 ఉచిత గ్యాస్ బండలు అని చెప్పి సబ్సిడీ డబ్బులు వేయకుండా మహిళలను దగా చేశారన్నారు. తల్లికి వందనం పథకంలో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తాము అని చెప్పి అధిక కరెంట్ బిల్లులు వంటి షరతులతో కోతలు విధించారన్నారు. ప్రతి సంవత్సరం రైతుల ఖాతాల్లో రూ.20 వేలు వేస్తామని చెప్పి వారిని మోసం చేసిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ ముఖ్య నాయుకులను అక్రమ కేసులతో వేధిస్తూ జైలుకి పంపుతున్నారన్నారు. మద్యం కేసుతో ఎటువంటి సంబంధం లేకపోయినా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్ట్ చేశారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి గడపకి తీసుకువెళ్లి హామీలు అమలు చేసే విధంగా ప్రజల్ని చైతన్య పరచాలన్నారు. తెలుగు దేశం పార్టీ నుంచి నక్కా దావీదు కుటుంబం విజయరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ కె.రామకృష్ణ, అంకాలంపాడు సర్పంచ్ చౌక్కా స్వర్ణ, వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, ఎంపీటీసీ సభ్యురాలు గోరిఖ క్రాంతి కుమారి, వీరిశెట్టిగూడెం సర్పంచ్ దేవరపల్లి రామ్మోహన్‌రావు, కామవరపుకోట టౌన్ ప్రెసిడెంట్ నానాది సాగర్, అంకాలంపాడు ఉపసర్పంచ్ కేసరి శ్రీహరి, ఉప్పలపాటి మోహన్‌రావు పాల్గొన్నారు.

హారికపై దాడి హేయమైన చర్య




హారికకు నియోజకవర్గ బీసీ నాయకుల సంఘీభావం

చింతలపూడి: కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హారికపై జరిగిన దాడి అత్యంత హేయమైన చర్య అని చింతలపూడి నియోజకవర్గ బీసీ నాయకులు అన్నారు. ఆదివారం రేచర్ల గ్రామ సర్పంచ్ కె శివరామకృష్ణ ఆధ్వర్యంలో జెడ్పీ చైర్‌పర్సన్ హారికను కలిసి సంఘీభావం తెలిపారు. హారికపై జరిగిన దాడిని బీసీలపై జరిగిన దాడిగా భావిస్తున్నట్లు తెలిపారు. వెంటనే బాధ్యులను అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులను భయ భ్రాంతులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాన్వెంట్ రాజు, పెనుగొండ శివరామకృష్ణ యాదవ్, చింతా గోపాలకృష్ణ యాదవ్ తదితరులు ఉన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

కొయ్యలగూడెం: విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ విద్యుత్ మీటర్ల రీడర్స్ యూనియన్ ఒక ప్రకటనలో పేర్కొంది. షిఫ్ట్ ఆపరేటర్స్‌గా పోల్ టు పోల్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, వాచ్మెన్, అటెండర్, బ్రేక్ డౌన్ గ్యాంగ్ సిబ్బంది గా రీడర్స్ సిబ్బందినే నియమించాలన్నారు. ఉదయం పది గంటలకు రామవరప్పాడు రింగ్ రోడ్డు నుంచి విద్యుత్ సౌధా వరకు సిబ్బందితో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కాగా ఈ కార్యక్రమానికి ప్రభుత్వం ఆంక్షలు విధించడాన్ని యూనియన్ నాయకులు తప్పుబట్టారు. ముఖ్య నాయకులను హౌస్ అరెస్టులు చేయడం, కొందరిని ముందుస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడం అన్యాయం అన్నారు. ఎవరెన్ని ఆంక్షలు పెట్టినా చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని నాయకులు పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలి



బుట్టాయగూడెంలో పోస్టర్‌లను విడుదల చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మా ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వద్దు అనే గోడ పోస్టర్లను సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు మొడియం నాగమణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆదాని స్మార్ట్ మీటర్లను ప్రతి ఇంటికీ బిగించేందుకు సన్నాహాలు చేస్తోందన్నారు. ఇప్పటికే పలు చోట్ల మీటర్లు బిగిస్తుంటే ప్రజలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. అధికారంలో లేనప్పుడు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వ్యతిరేకించి అధికారంలోకి వచ్చాక ప్రజలపై విద్యుత్ భారం మోపాలని చూస్తున్నారని మండిమడ్డారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ చార్జీలతో ప్రజలు సతమతమవుతున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని మానుకోకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తెల్లం రామకృష్ణ, తామా ముత్యాలమ్మ, కోర్స జలపాలు, పోలోజు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బస్సు షెల్టర్ నిర్మించండి



కన్నాపురం సెంటర్లో మండుటెండల్లో ప్రయాణికుల పడిగాపులు

కొయ్యలగూడెం: కన్నాపురం సెంటర్లోని పులిరామన్నగూడెం రోడ్డులో బస్సు షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. దాదాపు పదిహేను గ్రామాలకు చెందిన గిరిజనులు నిత్యావసరాలకు, వివిధ పనులకు కన్నాపురం సెంటర్ మీదుగానే ప్రయాణం సాగించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికీ బస్సు షెల్టర్ ఏర్పాటు చేయకపోవడంతో గర్భిణులు, పసిపిల్లలతో మండుటెండల్లో రోడ్డుపై నిలబడాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు షెల్టర్ నిర్మాణానికి ప్రజాప్రతినిధులు అధికారులు చొరవ చూపాలన్నారు. అదే విధంగా కొయ్యలగూడెం గవర్నమెంట్ హాస్పిటల్‌కి ఎదురుగా బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు. గతంలో ఉన్న బస్సు షెల్టర్ రోడ్డు విస్తరణ నేపథ్యంలో తొలగింపునకు గురైందని దాంతో జంగారెడ్డిగూడెం, ఏలూరు ఏరియా జనరల్ హాస్పిటల్స్‌లకు వెళ్లడానికి ఇబ్బందులకు గురవుతున్నామని రోగులు, వారి బంధువులు పేర్కొంటున్నారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె



కొయ్యలగూడెం: విజయవాడ కనకదుర్గమ్మకు కొయ్యలగూడెం నుంచి ఆషాఢ సారె తీసుకువెళ్తున్న మహిళా భక్తులు



కామవరపుకోట: తడికలపూడిలో ఆషాఢ సారె సమర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఆషాఢ మాసం చివరి ఆదివారం పురస్కరించుకుని ఆయా ప్రాంతాల్లో వెలసిన అమ్మవార్లకు భక్తులు ఆషాడ సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గుర్వాయిగూడెం గ్రామ దేవత శ్రీ గంగానమ్మ అమ్మవారికి మహిళలు ఆషాడ సారె సమర్పించారు. అయ్యప్ప స్వామి ఆలయం నుంచి మహిళలు సారె, పానకంతో ఊరేగింపుగా గంగానమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. మేళతాళాలు, తీన్మార్ డప్పులతో వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో 200 మంది మహిళలు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆషాఢ సారెతో ఇంద్రకీలాద్రికి

కొయ్యలగూడెం: ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మకు కొయ్యలగూడెంకు చెందిన భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. అమ్మవారి పాదుకలను, సారే సామాగ్రిని మహిళలు శిరస్సుపై ధరించి అమ్మవారి శరణు ఘోష చేస్తూ విజయవాడకు తరలివెళ్లారు. వారికి గ్రామస్తులు వీడ్కోలు పలికి వారి వెంట పాదయాత్ర చేశారు. కొయ్యలగూడెం గ్రామదేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కామవరపుకోటలో...

కామవరపుకోట: మండలంలోని పాతూరు వాలీసుగ్రీవుల గట్టు సమీపంలో శతాబ్దాల చరిత్ర ఉన్న గుడ్లగురవమ్మ అమ్మవారికి, తడికలపూడిలోని శ్రీ గంగానమ్మ శ్రీ అంకాలమ్మ , శ్రీ మహాలక్ష్మి అమ్మవార్లకు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలతో భారీ ఊరేగింపుగా చుట్టుపక్కల పరిసర ప్రాంత గ్రామాల నుంచి మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి స్వీట్లు, పండ్లు, పిండివంటలతో పాటు పసుపు, కుంకుమ, గాజులు సమర్పించారు. పూజల అనంతరం ప్రసాద వితరణ చేశారు.



జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెంలో గంగానమ్మకు సారె సమర్పించిన దృశ్యం



కామవరపుకోట: పాతూరులో గుడ్లగురవమ్మ అమ్మవారికి సమర్పించిన ఆషాఢ సారె

నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం



యర్రబోరులో నిర్వాసితుల సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ మునీర్

వేలేరుపాడు:: నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ నాయకులు అన్నారు. మండలంలోని యర్రబోరు గ్రామంలో పోలవరం నిర్వాసితుల సదస్సు సిరికొండ రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంటూర్ లెక్కలు చెప్పి మునిగే గ్రామాలను కలపకుండా మునగని గ్రామాలకు ప్యాకేజీ ఇచ్చి నిర్వాసితులతో చెలగాటం ఆడుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో మరో పోరాటాన్ని అఖిలపక్షం తరుపున నిర్వహిస్తామని తెలిపారు. దీనిలో భాగంగా యర్రబోరు, శుద్దగుంపు, నడుంగమ్మ కాలనీ గ్రామాల నిర్వాసితులతో సోమవారం తహసీల్దార్ కార్యాలయ ముట్టడి నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి నిర్వాసితులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మునీర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మడివి దుర్గారావు, మండల కార్యదర్శి బాడిశ రాము, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోల్లూరి సత్తిబాబు, సీపీఐ ఎంఎల్ ప్రజాపంద మాస్‌లైన్ జిల్లా నాయకులు గడ్డాల ముత్యాలరావు, కట్టం ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో చెట్ల నరికివేత

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడు పంచాయతీ గిరిజన గ్రామమైన కిచప్పగూడెం సమీపంలోని ప్రభుత్వ భూమిలో చెట్ల నరికివేత కొనసాగిస్తున్నారని గిరిజనులు ఆదివారం ఆరోపించారు. సర్వే నెంబరు 284లో గల భీముడు మెట్టగా పిలవపడే ప్రాంతంలో సుమారు పదకొండు ఎకరాల భూమి ఉంటుందని దీనిని గిరిజనుల ఇళ్ల స్థలాల కోసం కేటాయించుకోవడం జరిగిందన్నారు. అయితే ఏవిధమైన కారణం చెప్పకుండానే కొందరు వ్యక్తులు యథేచ్ఛగా గత రెండు రోజుల నుంచి జీడి మామిడి చెట్లు భారీగా నరికివేస్తున్నారని అన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కోడిపందేలపై దాడి

జంగారెడ్డిగూడెం: స్థానిక వేంకటేశ్వరస్వామి గుడి సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందేలపై దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు హెచ్‌సీ బాబూరావు తెలిపారు. నిందితుల నుంచి రూ.1000 నగదు, 1 కోడి, కోడి కత్తి స్వాధీనం చేసుకున్నామన్నారు.

వృద్ధురాలికి తీవ్ర గాయాలు

చింతలపూడి: స్థానిక కొత్త బస్టాండ్‌లో ఆదివారం ఆర్‌టీసీ బస్సు దిగుతున్న ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం చాట్రాయి గ్రామానికి చెందిన తుమ్మల లక్ష్మి మండలంలోని పట్టాయిగూడెం గ్రామంలోని తన సోదరి ఇంటికి వెళ్తూ బస్సు దిగే క్రమంలో ప్రమాదవశాత్తూ జారిపడడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. తోటి ప్రయాణికులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుండి విజయవాడకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా బట్టీలపై దాడి.. ఇద్దరి అరెస్ట్



సారా నిందితులతో చింతలపూడి పోలీసులు

చింతలపూడి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని కొమ్ముగూడెం గ్రామ సమీపంలో పామాయిల్ తోటలోని సారా తయారీ స్థావరాలపై ఆదివారం చింతలపూడి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారుచేస్తున్న బాణావతు విష్ణు, ధారావత్ పవన్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి 20 లీటర్ల సారా, 700 లీటర్ల బెల్లపు ఊట, గ్యాస్ స్టవ్, సిలిండర్, పాత్రలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె సతీష్ కుమార్ తెలిపారు.